# 27. తోక సినిమాలు

"సినిమా బాగుంది; తప్పకుండా చూడండి" అని చాలా మంది రికమండ్ చేసేరు.

"నిజంగానే?" అని యథావిధిగా ఆశ్చర్యాన్ని ప్రకటించేను.

"అవునండి! ఇంతకీ అది మనవాళ్ళు తీసిందికాదు. ఫారిన్ ఫిల్ముంలెండి!" అని వారు అభయం ఇచ్చేరు.

సరేనని మా లిటిల్ రాస్కేల్‌ను వెంటేసుకుని ఓ ఆదివారం వెళ్లాను. మావాడింకా టిక్కెట్టు కొనక్కర్లేని వయస్సులోనే ఉన్నాడు గానీ నిశిత పరిశీలనలో అమెరికన్ సి. ఐ. ఏ. ఏజంట్లను మించినవాడు. దేన్ని గురించయినా క్రాస్ ఎగ్జామినేషన్ చేయటంలో ఘనుడు.

సినిమా మొదలవగానే మావాడు లేచి కుర్చీలో నుంచుని "నాన్నా! ఆ ముందు సీటాయన తలకాయ మరీ అంత ఎత్తుగా ఉందేం? మంగలి షాపుకు పోయేందుకు పైసల్లేవా? పాపం!" అనడిగాడు!

"నోర్ముయ్యరా, రాస్కేలూ! ఆయన విన్నాడంటే

ముందు నీ తలకాయ మీదివన్నీ మంగలి ఖర్చు లేకుండానే పీకి పోగులు పెట్టగలడు!" అని మందలించేను.

మా రాస్కేల్ కుర్చీలో సుంచునే సీరియస్‌గా సినిమా చూడనారంభించాడు. అడ్వర్టయిజుమెంట్ షార్ట్స్ ఆరంభమయ్యేయి. ఓ అడవిలో ఉత్తరాన్నుంచి ఓ సెక్సీ అమ్మాయి, దక్షిణాన్నుంచి ఓ హిప్పీ అబ్బాయీ కొంపలు మునిగి పోతున్నట్టుగా పరిగెట్టుకొచ్చి సరిహద్దురేఖ దగ్గర ఢాం మన్నని గుద్దేసుకున్నారు. క్లోజప్‌లో అమ్మాయి కళ్ళలో నక్షత్రాలు కదిలేయి. అబ్బాయి కళ్ళలో మెరుపులు మెరిసేయి. మా రాస్కేలు లడ్డుండల డబ్బామీదికి దూకినట్లుగా ఆ హిప్పీ సుందరుడి మూతి సదరు సెక్సీ సుందరి మూతి మీదికి దూకబోయింది. కానీ ఆ సుందరి కడుపునొప్పి పేషంటులా ఓ మూలుగు మూలిగి మూతి అవతలకు తిప్పుకుని ముక్కు మూసుకుంది. హిప్పీరావు ఏడుపు మోహం పెట్టేడు.

మరుక్షణం చేతిలో ఓ టూత్‌పేస్టుతో ఓ డాక్టరు ప్రత్యక్షమై చిన్న ఉపన్యాసం ఇచ్చేడు. హిప్పీరావు ఆ పేస్ట్ అందుకుని అర్జంటుగా పళ్ళు తోముకుని మళ్ళీ సెక్సీ సుందరిని ఢాం ఢాంమ్మంటూ వాటేసుకున్నాడు. సుందరి ముక్కూ మూతీ వికసించేయి. వాళ్ళిద్దరి ముక్కులూ, మూతులూ దగ్గరవుతుండగా అకస్మాత్తుగా ఓ పెద్ద టూత్‌పేస్ట్ ట్యూబ్ వచ్చి తెరనంతా ఆక్రమించేసింది.

"ఆ వెనకాల వాళ్ళిద్దరూ ఏం చేస్తున్నారు నాన్నా!"
అని అడిగేడు మా రాస్కేల్.

"పళ్ళు తోముకుంటున్నార్లేరా!" అని వాడి నోర్మూసేను.

ఇంకోటి మొదలయింది. ఓ పాప చీదుకుంటూ, దగ్గుకుంటూ ఏడుస్తుంటే సినిమాస్టార్ లా వున్న ఓ లోకట్ జాకెట్ అమ్మ వయ్యారంగా వచ్చి ఏదో సీసాలోంచి కాస్త మందు తీసి ఆ పాపముక్కూ, గొంతూ, రొమ్మూ, వీపూ మా మంగలి కన్నా నేర్పుగా మాలీష్‌చేసి దుప్పటి కప్పింది. అర సెకన్‌లో ఆ పాప దుప్పటి తన్నేసి నవ్వుతూ లేచి ఆ మందు సీసాను ముద్దెట్టుకుంది!

"మన పక్కింటి సీమిడి ముక్కుకు ఓ సీసా కొనుక్కెళ్దాం నాన్నా!" అని ప్రతిపాదించేడు మా రాస్కెలు.

"వాళ్ళ నాన్న మనకన్నా ఎక్కువ సినిమాలు చూస్తాడు! వాళ్ళకా మాత్రం తెలుసున్లేరా!" అని వాడి నోర్మూసేను.

ఈసారి ఫ్లాస్కుల కంపెనీ అడ్వర్టయిజుమెంటు మొదలయింది. ఓ పదిమంది అమ్మాయిలూ, అబ్బాయిలూ తలా రెండు ఫ్లాస్కులూ చంకన్నేసుకుని స్కూటర్ల మీద పిక్నిక్‌కు బయల్దేరేరు. దార్లో ఓ స్కూటర్ ఫ్లాస్కుల కంపెనీ

ఆదేశం ప్రకారం దారితప్పి చెట్టును గుద్దేసి పచ్చడయి పోయింది. దాని మీదున్న అమ్మాయీ, అబ్బాయీ మాత్రం ఎగిరెళ్ళి డన్లపిల్లో లా ఉన్న పచ్చగడ్డిమీద పడ్డారు. అందరూ స్కూటర్లు ఆపి ఆందోళన అభినయిస్తూ వారిచుట్టూ మూగేరు. వాళ్ళు నవ్వుతూ లేచి చంకల్లోని ఫ్లాస్కుల్లోంచి తలోకాస్త కాఫీ పంచిపెట్టి "చూశారా! స్కూటర్ పచ్చడయినా ఈ ఫ్లాస్కులు మాత్రం చట్నీ అవలేదు. మీ ఫ్లాస్కులన్నీ పగలగొట్టేసి అర్జెంటుగా ఈ కంపెనీవే కొనుక్కోండి! అని ఉపన్యాసం ఇచ్చారు. వాళ్ళూ స్కూటర్లెక్కి అర్జంటుగా ఊళ్ళోకి పరుగెత్తారు.

"బోడి సలహాలూ, బోడెదవలూను. మొన్ననేగా నాన్నా, నేను చూడక తన్నేస్తే మన ఫ్లాస్కు పచ్చడయి పోయింది. నువ్వు నా పిర్ర పగలేశావు కూడాను" అని సీట్లో చతికిలబడ్డాడు మా వాడు!

ఇంతలో తెరమీద ఓ లావుపాటి కుర్రాడు ప్రత్యక్షమయ్యాడు.

"ఈ బోండాం గాడెవడు నానా! అనడిగేడు మా రాస్కెల్.

ఆ బోండాంగాడు వాళ్ళమ్మ ఇచ్చిన డ్రింక్ తాగి స్కూలుకు గంతులేస్తూ పరుగెత్తేడు. అక్కడ క్లాసులో అడి

గిన ప్రశ్నలకల్లా ఎన్‌సైక్లోపెడియాలా జవాబులిచ్చి మెప్పు పొందేడు. మళ్ళీ ఇంటికొచ్చి ఇంకో కప్పు తాగి ఆటలకు వెళ్ళాడు. అక్కడ ఆటలన్నింటిలో ఫస్టు ప్రైజులు కొట్టేసి మళ్ళీ ఇంటికొచ్చి ఇంకో కప్పుతాగేశాడు. అక్కణ్ణించి వెళ్ళి స్కూలు డ్రామాలో హీరోగా వేషం వేసి ఓ పిల్లు కొట్టేశాడు. మళ్ళీ ఇంకో కప్పు తాగాడు. అందరూ మీ అబ్బాయికి పోటిలేదమ్మా అని పొగడుతుంటే సదరు బోడాం మదరు నవ్వుతూ "అంతా ఈ డబ్బా మహాత్మ్యం" అని హ్యాండ్ బాగ్‌లోంచి ఓ డబ్బా తీసి చూపించి 'మీరూ రోజు కిరవై సార్లు ఈ డబ్బానే తాగండి!" అని సలహా ఇచ్చింది.

"ఆ బోండాంగాడు ఎప్పుడూ కాఫీ తాగడమేనా! అన్నం తినడేం నాన్నా! అనడిగేడు మా రాస్కేల్.

తర్వాత చాలా షార్ట్‌లు వచ్చాయి. ఒకదాంట్లో హీరోయిన్ని విలన్లు లాక్కెళ్ళి ఏడిపిస్తుంటారు! హీరో చూస్తూ 'అరే నా కాళ్ళు కదలవేం! నా చేతులు లేవవేం!' అంటూ జుట్టు పీక్కుని అంతలో తనుగడ్డం గీసుకోలేదని గుర్తుకు తెచ్చుకుంటాడు. ఏదీ నా రేజర్, ఏవీ ఫలాన కంపెనీ బ్లేడులు? అంటూ అరిచి అరంటుగా గడ్డం గీక్కుని పరుగెత్తుకెళ్ళి విలన్లను చావబాది హీరోయిన్ని అక్కున చేర్చుకుంటాడు. హీరోయిన్ అద్దంలాంటి వీడి గడ్డంలో చూసుకుంటూ చెదిరిన కురుల్ని, ఊడిన కోకను సరిచేసుకుంటుంది.

ఇంతలో ఓ పెద్ద బ్లేడు వచ్చి ఇద్దర్నీ కమ్మేసింది!

"వీడు గడ్డం గీసుకుసేదాకా ఆ విలన్లు దిక్కులు చూస్తూ అక్కడే ఎందుక్కూర్చున్నారు నానా," అనడిగాడు మావాడు.

"నీకు తెలీదులేరా! అంతా ఆ బ్లేడుల మహాత్మ్యం" అన్నాన్నేను.

"మరయితే ప్రొద్దున్న నీ గడ్డం తెగి రక్తం కారితే, వెధవ బ్లేడులు అంటూ బూతులు తిట్టావేం."

ఇంతలో ఇంకో పార్ట్ మొదలయింది. ఓ సినామాతార 'ఫలానా సబ్బె వాడండి. తెల్లబడటమేగాక నాలాగా సినిమా ఛాన్సులు కూడా సంపాదించొచ్చు' అంది. "మన పనిమనిషికో సబ్బు కొందాం నానా. అది బాగా నల్లగా ఉంటుంది గదా." అన్నాడు మా రాస్కెల్.

ఓ మందుల కంపెనీవాడు "మా విటమిన్ టాబ్లెట్ ఒక్కొక్కటి నాలుగు కిలోల అన్నానికి, ఆరు కిలోల కూరలకి, జాడీడు చింతకాయ పచ్చడికి సమానం! కనుక అదే మింగి బతకండి!" అని ప్రకటించాడు. ఇంకో కంపెనీవాడు ఇంకేదో చప్పరించి సుఖంగా బ్రతకమని సలహా పారేశాడు.

"అవీ-ఇవీ తినమంటారు గానీ అన్నం తినమని ఎవరూ ఏడవరేం నాన్నా!" అనడిగాడు మావాడు!

"అది కావాలని ఏడవటం మనవంతులేరా!" అని సర్దేను.

"బాగుంది నాన్నా, ఈ ఎదవన్నర సినిమాలు చూసేందుకు డబ్బెట్టి టిక్కెట్టు కూడా కొనాలా! పోదాం పద!" అని చిందులేశాడు మావాడు.

"తప్పురా నాయనా! ఇలాగైతే రేపు నీ కెవడూ ఉద్యోగం ఇవ్వడు. స్కూల్లో సీటుకూడా దొరకదు, అలా అనగూడదు!" అని వాడి నోర్మూసి భద్రంగా వళ్ళో కూర్చోబెట్టుకున్నాను.

అదృష్టంకొద్దీ ఇంతలో అసలు సినిమా మొదలయింది.

(డిశంబర్, 1972)